# ఆసరాతో మహిళల ఆర్థికాభివృద్ధి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- రామలక్ష్మణ్‌లా కలిసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తాం
- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు



మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, పక్కన ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి రూరల్:** రాష్ట్రంలో మహిళా సాధికారిత ధ్యేయంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో మహిళలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యతనివ్వడంతో అభివృద్ధితో దూసుకుపోతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆసరా పథకం మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడిందన్నారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ సంబరాలు నిర్వహించారు. ముందుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి అక్కచెల్లెమ్మలు పాలాభిషేకం చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందితేనే పట్టణాలు, నగరాలు అభివృద్ధి సాధిస్తాయని గుర్తించి ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందేలా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మండలంలోని 1,128 పొదుపు సంఘాలకు మూడో విడత రూ.8.92 కోట్లు అక్కచెల్లెమ్మలకు నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నవరత్నాలకు ప్రవేశపెట్టి అన్నీ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఆసరా ద్వారా రుణమాఫీ చేసి అక్కచెల్లెమ్మల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో వైద్యశాలలను అభివృద్ధి చేస్తున్నారన్నారు.

రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు మాట్లాడుతూ కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే తప్పా మరొక పార్టీ గెలిచే అవకాశం లేదని, ఎవరైనా అలా అనుకుంటే వారి పగటికలలే అన్నారు. కావలిలో ఎన్నో కార్యక్రమాలు చూశామని ఇంత మంది మహిళలు ఈ కార్యక్రమానికి రావడం చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి, తాను రామలక్ష్మణ్‌లాగా కలిసి పనిచేసి కావలిని కనకపట్నం చేస్తామన్నారు. కావలి నియోజకవర్గానికి చెందిన తాను రాజ్యసభలో ఉన్నానంటే అది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, కావలి నియోజకవర్గ ప్రజల ఆదరాభిమానాలేనన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2,400 కిలోమీటర్లు పాదయాత్ర చేసి అందరి కష్టాలు తెలుసుకుని, అందరి ఆశీస్సులతో జననాయకుడు అయ్యారన్నారు. అలాంటి జన నాయకుడిని మన రాష్ట్రానికి శాశ్వతంగా ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. మహిళలు అభివృద్ధి సాధిస్తేనే కుటుంబాలు అభివృద్ధి చెంది రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని అన్నిట్లో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మహిళలకు పొదుపు రుణాలు రుణమాఫీ చేస్తామని మోసం చేస్తే మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట మేరకు మహిళలకు రుణాల నుంచి విముక్తి కల్పించారన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. అనంతరం పొదుపు సంఘాలు వైఎస్సార్ ఆసరా ద్వారా లబ్ధితో పాటు బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చుకున్న స్వయం ఉపాధి పథకాలకు చెందిన స్టాల్స్‌ను పరిశీలించారు. మహిళలకు వైఎస్సార్ ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కావలి నియోజకవర్గ పరిశీలకులు కదిరి బాబురావు, ఆర్డీఓ శీనానాయక్, డీఎస్పీ ఎం.వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, ఎంపీపీ ఆలూరి కొండమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, పందిటి కామరాజు, నాయుడు రాంప్రసాద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### వైభవంగా సీతారాముల గరుడోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న సీతారాములు

**వరికుంటపాడు:** స్థానిక కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా మంగళవారం గరుడ వాహనంపై సీతారాముల వారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఉభయకర్తలు సోమవారం రాత్రి నాగార్పమ్మ ఆలయం వద్ద నుంచి ఊరేగింపుగా నైవేద్యాలు రామాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం సందర్భంగా మహిళలు నైవేద్యాలు సమర్పించారు.

### వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ నేడు

**బిట్రగుంట:** బోగోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డాక్టర్ వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరుకావాలని సూచించారు.

### వైభవంగా సాయిబాబా మందిర వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న ధర్మకర్తలు

**వరికుంటపాడు:** స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నిర్మించిన సాయినాథుని మందిరంలో మంగళవారం ప్రథమ వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. మందిరం ధర్మకర్త సుంకర వెంకటాద్రి దంపతులు పూర్ణాహుతి సమర్పించారు. అర్చకులు హోమాలు నిర్వహించారు. సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

### వైఎస్సార్ బీమా నగదు అందజేత



వైఎస్సార్ బీమా నగదును అందజేస్తున్న దృశ్యం

**చేజర్ల:** మండలంలోని వావిలేరుకు చెందిన మాలపాటి వెంకటేశ్వరరెడ్డి భార్య మల్లీశ్వరమ్మకు వైఎస్సార్ బీమా కింద రూ.10 వేల నగదును మంగళవారం మైపాటివారి కండ్రిక గ్రామ సర్పంచ్ ఎం.పెంచలయ్యఅందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే వెంకటేశ్వర్లురెడ్డి, ఎం.పెంచలరెడ్డి పంచాయతీ కార్యదర్శి వై సురేష్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ ఎస్ కరుణతేజ తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో నాడు-నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

**సంగం:** మండలంలోని పలు పాఠశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులను ఈఈ ఏఎస్‌కుమార్, ఏఈ మహేంద్ర మంగళవారం పరిశీలించారు. సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించి త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా లోపం లేకుండా చూడాలన్నారు. వారి వెంట ఎంఈఓ జానకిరాం, సిబ్బంది ఉన్నారు.

### వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

**ఆత్మకూరు:** అనుమానంతో తన భర్త అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారని ఆత్మకూరుకు చెందిన మహిళ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై శివశంకర్‌రావు సమాచారం మేరకు.. పట్టణంలోని ముత్తరాజు వీధికి చెందిన ఆళ్ల మౌనిక పెంచల ప్రసాద్ దంపతులు. చెన్నైలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న పెంచలప్రసాద్ ఇటీవల భార్యపై అనుమానం పెంచుకుని వేధింపులకు గురి చేస్తున్నాడని, అతనికి తోడుగా అత్త పద్మమ్మ, మామ నరసింహులు వత్తాసు పలుకుతూ తనను మానసికంగా వేధిస్తున్నట్లు మౌనిక ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## సమస్యల పరిష్కారానికి చొరవ

- ఎంపీపీ శశిరేఖ



మాట్లాడుతున్న ఎంపీపీ శశిరేఖ

**అల్లూరు:** మండలంలోని అన్ని పంచాయతీల్లో నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని ఎంపీపీ శశిరేఖ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలం సమీపించడంతో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా తీర ప్రాంత గ్రామాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కోరారు. అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను తెలుసుకోవడంతో పాటు వాటిని పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధిని కూడా చేస్తోందన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారని వీటితో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు వేణమ్మ, ఎంపీడీఓ శ్రీదేవి, వైస్ ఎంపీపీ సురేంద్ర, డిప్యూటీ తహసీల్దార్ చెంచయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆశ కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న వైద్యాధికారిని కరిష్మా

**వరికుంటపాడు:** ఆశ కార్యకర్తలు గ్రామాల్లో వారికి కేటాయించిన సబ్‌సెంటర్ల పరిధిలో బాధ్యతగా వ్యవహరించాలని మండల వైద్యాధికారిణులు కరిష్మా, ఆయేషా పేర్కొన్నారు. మంగళవారం వైద్యశాలలో నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఎండలు అధికంగా ఉండడంతో ఆశ కార్యకర్తలు సబ్‌సెంటర్ల పరిధిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ సోకకుండా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పిస్తుండాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష యోజన ద్వారా ప్రతి నెల 9వ తేదీ గర్భిణులకు జరిగే వైద్య పరీక్షలకు వారిని తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో పీహెచ్ఎస్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ రియాజ్ పాల్గొన్నారు.

## తల్లీ బిడ్డ క్షేమంగా ఉండడమే లక్ష్యం



మాట్లాడుతున్న డాక్టర్ సురేష్

**అనుమసముద్రంపేట:** ప్రభుత్వ వైద్యశాలలో కాన్పు అయిన తర్వాత తల్లి, బిడ్డ క్షేమంగా ఉండడమే తమ ప్రధాన లక్ష్యమని ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యులు సురేష్ అన్నారు. ఆశ డే సందర్భంగా మంగళవారం వైద్యశాలలో ఆశ కార్యకర్తలు, ఏఎస్ఎంలకు డాక్టర్ విధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ కార్పొరేట్ వైద్యశాలలకు దీటుగా పీహెచ్‌సీల్లో వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఆశ వర్కర్లు ఇంటింటికి వెళ్లి గర్భిణులకు హిమోగ్లోబిన్ శాతం తప్పని సరిగా చూడాలని, రక్త హీనత ఉంటే ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లను తప్పని సరిగా వేయాలని సూచించారు. ఎంతో మంది పేదలు ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లలేక ప్రభుత్వ వైద్యశాలలకు వస్తున్నారని, అటువంటి వారి కోసం వైద్య సేవలు మరింత చేరువగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మంజుల, వైద్య సిబ్బంది ఉన్నారు.

## 61 శాతం పింఛన్ల పంపిణీ



మహిమలూరు గిరిజన కాలనీలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వలంటీరు



ఆత్మకూరు: మంచానికే పరిమితమైన కొండయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీరు సైదుల్లా

**ఆత్మకూరురూరల్:** మండలంలో తొలి రోజు మంగళవారం 61 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. నూతన ఆర్థిక సంవత్సరం కారణంగా మంగళవారం ఆలస్యంగా సామాజిక పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. నూరు శాతం పంపిణీకి వేగవంతంగా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను ఆదేశించామన్నారు.

**ఆత్మకూరు:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ పింఛన్ల పంపిణీ నేరుగా ఇళ్ల వద్దకే ఇచ్చేలా వలంటీర్ల వ్యవస్థ ద్వారా ఏర్పాటు చేయడంతో పలువురు వృద్ధులు, మంచానికే పరిమితమైన వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో మంగళవారం నుంచి ప్రారంభమైంది. గతంలో తాము మున్సిపల్ కార్యాలయం వద్ద పడిగాపులు గాస్తే గానీ పింఛన్ అందేది కాదని కుటుంబ సభ్యులు తెలిపారు.

## పేలవంగా టీడీపీ బీసీల సమావేశం

**ఆత్మకూరు:** బీసీల మద్దతు తమకే ఉందంటూ గొప్పలు చెప్పుకునే టీడీపీ ఆత్మకూరులో మంగళవారం ఏర్పాటు చేసిన వడ్డెరుల బీసీ సమావేశం పేలవంగా జరిగింది. ఆ పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి స్థానిక నేతలపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణంలోని నేతాజీ క్లబ్‌లో టీడీపీ ఆధ్వర్యంలో వడ్డెరుల బీసీ సమావేశం నిర్వహించారు. బట్టేపాడుకు చెందిన ఓ గ్రామ స్థాయి బీసీ నాయకుడిని ఎక్కువ మందిని సమీకరించాలని ఆదేశించారు. అయితే 40 మందికి లోపే ఈ సమావేశంలో పాల్గొన్నారు. దీంతో నియోజకవర్గ నాయకుడు అసహనం వ్యక్తం చేశాడు. మరో వర్గానికి చెందిన వ్యక్తి తనకే ఆ బాధ్యత అప్పగించి ఉంటే 500 మందికిపైగా తీసుకొని వచ్చి ఉండేవాడినని మాట్లాడడంతో గందరగోళం ఏర్పడింది. చిత్రీకరిస్తున్న ఓ విలేకరిపై టీడీపీ నాయకుడు మండి పడ్డాడు. మీడియాను ఎవరు పిలిచారంటూ పరుష పదజాలంతో మాట్లాడాడు.

### శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం

**చేజర్ల:** మండలంలోని ఆదూరుపల్లి కోదండరామస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి ఉత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, విశేషాభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య రాత్రి 8 గంటలకు శ్రీరాముడు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం తెల్లవారు జామున అగ్నిగుండ ప్రవేశం, సాయంత్రం సీతారాముల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

### హనుమంతుడిపై వేణుగోపాలుడి విహారం



రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి

**ఆత్మకూరురూరల్:** మండలంలోని మహిమలూరులో కొలువైన అతి పురాతన రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లు హనుమంత వాహనంపై తిరువీధుల్లో విహరించి భక్తులకు దర్శనం ఇచ్చారు. నెల్లూరులో స్థిరపడ్డ మహిమలూరుకు చెందిన వైశ్య కుటుంబీకులు ఉభయకర్తలుగా వ్యవహరించి స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు దీప నైవేద్యాలు సమర్పించారు.

### వైభవంగా వేణుగోపాల స్వామి గ్రామోత్సవం



వేణుగోపాలస్వామి గ్రామోత్సవం

**జలదంకి:** మండలంలోని బ్రాహ్మణక్రాకలో వేణుగోపాలస్వామి గ్రామోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను రకరకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారికి శేష వాహనసేవ, హనుమంత సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, డప్పు వయిద్యాల నడుమ స్వామి గ్రామోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కర్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం మోహిని ఉత్సవం, గరుడసేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

### వైభవంగా శేషవాహన ఉత్సవం



శేష వాహనంపై రాములోరు

**ఆత్మకూరు:** పట్టణంలోని సత్రం సెంటర్‌లో కోదండరామాలయంలో రాములవారి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు మంగళవారం శేష వాహనంపై స్వామివారిని కొలువుదీర్చి వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గ్రామోత్సవంలో తమ ఇళ్ల ముంగిటకు వచ్చిన స్వామి వారికి భక్తులు నారికేళాలు సమర్పించారు.

## పల్లెపల్లెలో జగనన్నకు నీరాజనాలు

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

**కావలి:** రాష్ట్రంలో జగన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పల్లెపల్లెలో జగనన్నకు ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కావలి మండలం రుద్రకోటలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా ప్రతి కుటుంబానికి అందిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్స్‌ను అందించారు. ప్రతి కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా పెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జనరంజకంగా పాలన చేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వాటిని సంవత్సర కాల వ్యవధిలోనే అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ఎన్నో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుని దేశంలోని అందరి దృష్టిని సారించి ఆదర్శంగా నిలిచారని, అలాంటి యువ ముఖ్యమంత్రిని మళ్లీ గెలిపించుకుని రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు వద్దకు వచ్చి వారికి ప్రభుత్వ పథకాలు వివరించి, వారు ఏ పథకాలకు అర్హులో గుర్తించి ఆ పథకాల్లో లబ్ధిదారులుగా చేసే వ్యవస్థ అయిన సచివాలయ, వలంటీర్లు వల్ల పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## నేటి నుంచి సంగమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన సంగమేశ్వరస్వామి ఆలయం

**సంగం:** త్రివేణి సంగమం ఒడ్డున కొలువైన కామాక్షితాయి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం అంకురారోహణతో ప్రారంభమవుతున్న బ్రహ్మోత్సవాలు 15వ తేదీ ధ్వజ అవహరోణతో ముగియనున్నాయి. 5న ఉదయం అంకురారోహణ, రాత్రి ధ్వజారోహణ, 6వ తేదీ రాత్రి శేషవాహనం, 7వ తేదీ రాత్రి అశ్వవాహనం, 8న రాత్రి సింహవాహనం, 9న పులివాహనం, 10న రావణ సేవ, 11న రాత్రి నందిసేవ, 12వ తేదీ ఉదయం రథోత్సవం, రాత్రి పురుషామృగ వాహనం, 13వ తేదీ సాయంత్రం గిన్నెభిక్ష, రాత్రి కల్యాణం, 14న ఉదయం మేష సంక్రమణం, పుణ్యకాల తీర్థవాది, సాయంత్రం అలకలతోపు, రాత్రి తెప్పోత్సవం, ధ్వజారోహణ, 15న సాయంత్రం గంగఒడి ఉత్సవం, రాత్రి ఏకాంత సేవతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి. ఈ సందర్భంగా కామాక్షితాయి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రతి నిత్యం వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ సందర్భంగా సంగమేశ్వరాలయం వివిధ రంగులతో శోభాయమానంగా ముస్తాబైంది. రాష్ట్రం నలుమూలల నుంచి సంగం మండలంలోని స్థానికులందరూ ఈ బ్రహ్మోత్సవాలకు రావడం ఆనవాయితీ.

## భూములు పరిశీలించిన ఆర్డీఓ



భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

**ఉదయగిరి:** మండలంలో వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల భూములను మంగళవారం ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారి పరిశీలించారు. ఉదయగిరి పట్టణంలోని సర్వే నంబర్లు 514/2, 95/11, కుర్రపల్లిలో 38 సర్వే నంబర్లలోని వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలని పట్టాదారులు దరఖాస్తు చేసుకున్నారు. దీంతో ఆమె ఆ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. ఆమె వెంట తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి, సర్వేయర్ రవి, మీరావలి, వీఆర్వో వెంకట్, సిబ్బంది ఉన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను కలిసిన విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు శేషం సుదర్శన్

**ఆత్మకూరు:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్ అన్నారు. దళితులు, మైనార్టీలు తదితర అన్నివర్గాల వారికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మంగళవారం జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు శేషం సుదర్శన్ తదితరులు డాక్టర్ శ్రావణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలపై దళితులు అందరికీ పారదర్శకంగా సంక్షేమాలు అందుతున్న విషయంపై చర్చించారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలు అందే అవకాశం రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించనుందని డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు.

## వైఎస్సార్ ఆసరా సంబరాలు



లబ్ధిదారులకు నగదు చెక్‌ను అందజేస్తున్న దృశ్యం

**సంగం:** స్థానిక ఓ కల్యాణ మండపంలో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో 645 పొదుపు గ్రూపులకు రూ.5.11 కోట్ల నగదును పొదుపు అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేసిన నమూనా చెక్‌ను వైఎస్సార్ క్రాంతి పథం ఏపీయం విజయలక్ష్మి జెడ్పీటీసీ రావుల లక్ష్మి, ఎంపీడీఓ గోపి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు తుంగా ఇందుదర్‌రెడ్డి, దేవసహాయం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుల కంబిటాబత్తిన రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులైన మహిళలకు అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కో-ఆర్డినేటర్ ముడి మల్లికార్జునరెడ్డి, పట్టాభి, మానికల చందన్ కుమార్ తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ సమస్యలపై అర్జీల వెల్లువ



మర్రిపాడులో అర్జీలు స్వీకరిస్తున్న వీఆర్‌ఓలు

**మర్రిపాడు:** మండలంలో మంగళవారం జరిగిన ప్రత్యేక రెవెన్యూ సదస్సుకు అర్జీలు వెల్లువెత్తాయి. మండలంలోని 17 సచివాలయాల్లో తహసీల్దార్ హేమంత్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ నెల 11న ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అధ్యక్షతన జేసీ, ఆర్డీఓల ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తున్నారు. ఆ సదస్సుకు ముందుగా రైతుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా తహసీల్దార్ తెలిపారు.

## ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న శ్రీవారి ఆస్పత్రి వైద్య సిబ్బంది

**ఆత్మకూరురూరల్:** విధి నిర్వహణలో నిరంతరం తలమునకలై ఉండే ఉద్యోగులు తమ ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఆత్మకూరులోని శ్రీవారి ఆస్పత్రి వైద్యుడు పయ్యావుల ప్రసాద్ అన్నారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ షుగర్ వ్యాధి సంక్రమించిన వారికి అన్ని రకాల వ్యాధి లక్షణాలపై ప్రభావం ఎక్కువగా చూపుతుందన్నారు. కిడ్నీ, పక్షవాతం, గుండె జబ్బులు, సంక్రమించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యుల సూచనలకు అనుగుణంగా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడంతో పాటు ప్రతి ఒక్కరు తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. రోజులో అరగంట పాటు వాకింగ్, వ్యాయామాలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, శ్రీవారి ఆస్పత్రి మేనేజరు దిలీప్‌యాదవ్, మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.